చోడవరం క్వారీపై పచ్చగద్దల కన్ను

- గ్రామసభ పేరుతో గ్రీన్ సిగ్నల్‌కు యత్నం
- బెడిసికొట్టిన వ్యూహం



చోడవరం క్వారీలో అక్రమంగా ఇసుక తవ్వటంతో ఏర్పడిన గుంతలు

పెనమలూరు: చోడవరం ఇసుక క్వారీపై పచ్చగద్దల కన్ను పడింది. ఇప్పటికే ఈ ఇసుక క్వారీలో భారీగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. భవిష్యత్తులో ఇసుక దందాకు ఎటువంటి అడ్డంకులు ఎదురు కాకుండా ఉండటానికి చోడవరం క్వారీని అధికారికంగా తెరిచి దోచేద్దామని పచ్చనేతలు పథకం వేశారు. అయితే గ్రామస్తులు ఎదురు తిరగటంతో అధికారులు నిర్వహించిన గ్రామసభలో చుక్కెదురైంది. వివరాల్లోకి వెళితే మండల పరిధిలో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతుంది. చోడవరం, పెదపులిపాక, నిషేధ యనమలకుదురు క్వారీలో అడ్డగోలుగా ఇసుక తవ్వుతున్నారు. ఇసుక అక్రమ రవాణాతో కృష్ణానదిలో ఇసుక మేటలు మాయమైపోయాయి. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక పథకం కనబడటం లేదు. గృహాలు, అపార్టుమెంట్‌లో నిర్మాణం చేసుకునే యజమానులు, బిల్డర్లు అధిక ధరలకు ఇసుక కొనుగోలు చేస్తున్నారు. అక్రమ ఇసుక పచ్చనేతలకు కాసుల వర్షం కురిపిస్తోంది.

చోడవరం క్వారీపై ప్లాన్..

చోడవరం ఇసుక క్వారీపై పచ్చగద్దలు ప్లాన్ వేశారు. ఈ క్వారీని అధికారికంగా తెరిపిస్తే అడ్డంగా ఇసుక అమ్మకాలు చేసి సహజ సంపదను దోచేయాలని ప్లాన్ వేశారు. ఇసుక క్వారీలో 7 హెక్టార్లలో 70 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలు చేయాలని రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో కలిసి స్కెచ్ వేశారు. ఇందులో భాగంగా సోమవారం చోడవరం గ్రామ పంచాయతీలో గ్రామసభ అధికారులు నిర్వహించారు. అయితే అధికారులు ఊహించని విధంగా గ్రామస్తులు గ్రామసభలో నిరసన గళం విప్పారు. చోడవరం ఇసుక క్వారీలో గత 9 నెలలుగా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇప్పుడు కొత్తగా ఇసుక క్వారీ తెరవటానికి గ్రామసభ దేనికని అధికారులను ప్రశ్నించారు. ఇప్పటికే కృష్ణానదిలో ఇసుక మేటలు అదృశ్యమయ్యాయని ఆరోపించారు. ఇసుక క్వారీ తమకు వద్దని, భూగర్భ జలాలు అట్టడుగుపోతున్నాయని అభ్యంతరం తెలిపారు. దీంతో అధికారులు బిక్కమొఖం వేసి వెనుతిరిగారు.

టీడీపీ నాయకులకు బిగుస్తున్న ఉచ్చు

- జిల్లా కలెక్టర్ దృష్టికి రైతుబజార్ ధ్వంసం ఘటన
- పరిశీలించిన వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు
- విచారణ చేపట్టి కారకులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు



పిల్లర్లు తొలగించి చదును చేసిన ఇరిగేషన్ స్థలం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు జాతీయ రహదారి సమీపంలోని ఇరిగేషన్ స్థలంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసి పిల్లర్ల దశ వరకు నిర్మాణం పూర్తయిన రైతుబజార్‌ను టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ధ్వంసం ఘటనపై సంబంధిత వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో గ్రామంలో ధ్వంసానికి గురైన రైతు బజార్‌ను తాజాగా అధికారులు పరిశీలించి జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మండల రెవెన్యూ అధికారుల సహకారంతో పిల్లర్లు ధ్వంసం చేసిన వారిని గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ప్రజల అవసరాలకు అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ ప్రత్యేక చొరవ తీసుకుని రైతుబజార్ ఏర్పాటుకై శంకుస్థాపన చేశారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నుంచి రూ 1.9 కోట్ల నిధులు కూడా మంజూరయ్యాయి. దీని నిర్మాణం నిమిత్తం అధికారికంగా టెండర్లు ఆహ్వానించి పునాదులు వేసి పిల్లర్ల నిర్మాణం పూర్తి చేశారు. ఇంత వరకు సజావుగానే జరిగినా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకులు బరితెగించి ఆయా శాఖల అధికారుల ప్రమేయం, సమాచారం లేకుండానే కూల్చివేయడం వివాదస్పదమైంది.

కోర్టులో ఉన్నదాన్ని ఎలా కూలుస్తారు

గ్రామంలోని రైతుబజార్ నిర్మాణ సమయంలో ఈ ప్రాంతంలోని ఇరిగేషన్ స్థలంలో శ్రీకృష్ణుడు, అయ్యప్ప ఆలయం, కార్మిక కార్యాలయం నిర్మించేందుకు కూడా పనులు మొదలుపెట్టారు. ఇరిగేషన్ స్థలంలో దేవాలయాలు ఎలా నిర్మిస్తారని అప్పట్లో టీడీపీకి చెందిన నాయకులు కోర్టులో కేసు వేశారు. దీంతో కోర్టు స్టే ఇవ్వడంతో నిర్మాణాలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. కోర్టులో ఉన్న రైతుబజార్ నిర్మాణ అంశంలో ఎటువంటి ఆదేశాలు వెలువడక ముందే ఎలా కూలుస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మాణం చేపట్టిన ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడాన్ని ఆయా గ్రామస్తులు తప్పు పడుతున్నారు.

ప్రత్యామ్నాయ రహదారికి అనుమతులు ఉన్నాయా..?

కాలువ గట్టు వాసులకు ప్రత్యామ్నాయ రహదారి అంశాన్ని తెరపైకి తీసుకొచ్చిన టీడీపీ నాయకులు వారికి అనుకూలంగా మార్చుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇందు కోసం కార్మిక భవనం, రైతు బజారును నేలమట్టం చేసి ప్రత్యామ్నాయ రహదారంటూ హడావుడీ చేస్తూ చదును చేయించారు. అసలు ప్రత్యామ్నాయ రహదారి నిర్మాణానికి ఆయా శాఖల అనుమతులు ఉన్నాయా, ఇరిగేషన్ స్థలంలో రహదారి నిర్మించవచ్చా అన్న సందేహాలు అందరిలో నెలకొంటున్నాయి. ఇప్పటికే చదును చేయించిన ఈ స్థలంలో సొంత వ్యాపారాలు నిర్వహణకై టీడీపీ నాయకులకు అప్పజెప్పేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

విద్యార్థులు సృజనాత్మకత అలవర్చుకోవాలి




విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

రామవరప్పాడు: విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే సృజనాత్మకత అలవర్చుకోవాలని నూతల పాటి స్రవంతి అన్నారు. కరెన్సీనగర్‌లోని రవీంద్ర భారతి పాఠశాలలో మంగళవారం కాన్వొకేషన్ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పేరెంట్ స్రవంతి మాట్లాడుతూ.. విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటుగా అంతర్గత నైపుణ్యాలపై పట్టు సాధించాలన్నారు. విద్యార్థుల ఆలోచనలకు ప్రాధాన్యతనిస్తూ ప్రోత్సహించాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ మానవత విలువలు గురించి అవగాహన పెంపొందించాలని, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉంటూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రవీంద్ర భారతి విద్యాసంస్థల చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, డైరెక్టర్ శాంతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతులు యూనిక్ ఐడీకీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

గన్నవరంరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యవసాయ పథకాలు అర్హులందరికీ అందేలా కొత్తగా ఫార్మర్ రిజిస్ట్రీ అనే కార్యక్రమం ప్రవేశపెట్టిందని ఎంఏవో వై.రజని మంగళవారం తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఆధార్ నంబర్ మాదిరిగా ప్రతి రైతుకు ఒక యూనిక్యూ నంబర్‌ను ప్రభుత్వం రైతుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందన్నారు. రైతుల యూనిక్యూ నంబర్ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో ఉండాలని ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. రైతులు గ్రామాల్లో ఉన్న రైతు సేవా కేంద్రాలను రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు. సొంత పొలం ఉన్న ప్రతి రైతు కూడా తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల వద్దకు వచ్చి పేర్లను రిజిస్టర్ చేయించుకోవాలని కోరారు. అలాగే ప్రతి రైతు పీఎం కిసాన్ నగదు, అన్నదాత సుఖీభవ(రైతు భరోసా), పంట నష్టం, ప్రతి రైతు బ్యాంకులో రుణం, పంటలకు బీమా చేయాలన్న తప్పనిసరిగా 11 సంఖ్యల యూనిక్యూ ఐడీ ఉండాల్సిందేనని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే పథకాలకు ఈ రిజిస్ట్రేషన్ నంబర్ అవసరమన్నారు. దీని కోసం సొంత భూమి కలిగిన రైతులు పాస్ పుస్తకం, ఆధార్ నంబర్, ఆధార్ నంబర్ లింక్ అయిన ఫోన్ నంబర్‌తో రైతు సేవా కేంద్రానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

ఉత్సాహంగా పాటల పోటీలు



పాటల పోటీల విజేతలతో నిర్వాహకులు

కంకిపాడు: పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 51వ వర్ధంతి సందర్భంగా కంకిపాడు శివాలయంలో మంగళవారం పాటల పోటీలు నిర్వహించారు. ఘంటసాల-ఎన్టీఆర్ స్మారక సంగీత కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో 15 ఏళ్ల లోపు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీనియర్స్ విభాగంలో కె.హేమశ్రీ(పెడసనగల్లు), బి.మహితశ్రీ (బొడ్డపాడు), జెఎస్వీ ప్రవల్లిక(కంకిపాడు), జూనియర్స్ విభాగంలో సీహెచ్ తేజస్విని, బిందుశ్రీ(కంకిపాడు), డి.నాగహర్షిణి (బొడ్డపాడు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. కార్యక్రమాన్ని కళాపీఠం అధ్యక్షుడు కాటూరు వెంకట మురళీకృష్ణ, కంకిపాడు శాఖ అధ్యక్షుడు బాపట్ల నాగేశ్వరరావు, నిమ్మకూరు గురుకుల పాఠశాల పూర్వ ప్రిన్సిపాల్ ముక్తేశ్వర్, ఆడేపు సాంబశివరావు, ఐనాల విశ్వేశ్వర్‌రావు, కానూరు భాస్కర్‌రావు పర్యవేక్షించారు.

అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తే కఠిన చర్యలు

రామవరప్పాడు: అనధికారికంగా విద్యుత్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విద్యుత్ శాఖ ఆపరేషన్ ఈఈ పి.హరిబాబు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు సెక్షన్ పరిధిలో మంగళవారం ఈఈ, డెప్యూటీ ఈఈ, ఏఈలు 36 బృందాలుగా ఏర్పడి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో గృహ వినియోగం 108, 7 వాణిజ్య వినియోగ సర్వీసుల్లో అదనపు లోడు వినియోగాన్ని, మల్టిబుల్ సర్వీసులు కలిగి ఉండటాన్ని గుర్తించి కేసులు నమోదు చేసి జరిమానా విధించారు. అనంతరం జరిగిన సమావేశంలో హరిబాబు మాట్లాడుతూ.. విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తే జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విద్యుత్ బకాయిలు తక్షణం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఈఈ పి.విజయకుమారి, డెప్యూటీ ఈఈ రామమూర్తి, బి.నవీన్, శివకుమార్, గుణదల డివిజన్ పరిధిలోని ఏఈలు, ఏఏఓ, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి పన్నుల రశీదులపై విచారణకు ఆదేశం

ఉయ్యూరు: ఉయ్యూరు మున్సిపాలిటీలో ఇంటి పన్ను రశీదులను మ్యానువల్‌గా రాసివ్వటంపై రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి కె.కన్నబాబు విచారణకు ఆదేశించారు. మున్సిపాలిటీలో చెల్లించిన ఇంటి పన్నుల రశీదులు ఆన్‌లైన్ రశీదులు ఇవ్వకుండా మ్యానువల్‌గా ఇవ్వటంపై సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి కన్నబాబును కలిసి ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వర్తించిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేదాంతం రఘుబాబు, కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావుపై విచారణ జరిపి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఫిర్యాదుపై స్పందించిన ముఖ్య కార్యదర్శి కన్నబాబు విచారణ చేయాలని ఆ శాఖ జాయింట్ సెక్రటరీ మురళీకృష్ణకు ఆదేశాలు జారీ చేశారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అభయాంజనేయునికి తమలపాకులతో విశేష పూజలు, అర్చనలు వైభవంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో దాతలు నెక్కంటి కార్తికేయ చౌదరి, కొనరాజు దుష్యంత్ కుమార్ సహకారంతో 200 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరమూర్తి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

న్యూ టయోటా క్యామ్రి ఆవిష్కరణ



టయోటా క్యామ్రిని ఆవిష్కరిస్తున్న రవికుమార్ సిన్హా, రామకృష్ణ

రామవరప్పాడు: టయోటా నుంచి సరికొత్త ప్రీమియం సెడాన్ కారు క్యామ్రిను ఎనికేపాడులోని లక్ష్మి టయోటా షోరూమ్‌లో మంగళవారం కెనరా బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రవి కుమార్ సిన్హా, లక్ష్మి టయోటా సీఈఓ రామకృష్ణ నగర మార్కెట్‌లోకి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సేల్స్, జనరల్ మేనేజర్ రాఘవ ప్రసాద్ మాట్లాడుతూ సరికొత్త ఈ క్యామ్రి కారు శక్తివంతమైన 2.5 లీటర్ హైబ్రిడ్ పెట్రోల్ ఇంజన్‌తో 230 హర్స్ పవర్ కలిగి ఉందన్నారు. కారు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకుందని చెప్పారు. 9 ఎయిర్ బ్యాగ్స్, టయోటా సెఫ్టీ సెన్స్‌తో పాటు విశాలవంతమైన ఇంటీరియర్స్‌ను పొందుపర్చారన్నారు. 6 ఆకర్షణీయమైన రంగులతో అందుబాటులో ఉన్న క్యామ్రి కారు ఎక్స్ షోరూమ్ ప్రారంభ ధర రూ.48 లక్షలు అని తెలిపారు. కార్యక్రమంలో సర్వీసు జనరల్ మేనేజర్ పవన్, ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు, వినియోగదారులు పాల్గొన్నారు.

వీరమ్మ తల్లీ...చల్లంగ చూడమ్మా



అమ్మవారిని దర్శించుకుంటున్న డీఎస్పీ శ్రీనివాసరావు

ఉయ్యూరు: వీరమ్మ తల్లీ..చల్లంగ చూడమ్మా...అంటూ అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఉయ్యూరు వీరమ్మ తల్లి తిరునాళ్లు మంగళవారంతో నాలుగో రోజుకు చేరాయి. అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకునేందుకు వస్తున్న భక్తజనంతో తిరునాళ్ల ప్రాంగణం భక్తజన కోలాహలంగా మారింది. గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, ఉయ్యూరు, కంకిపాడు సీఐలు రామారావు, మురళీకృష్ణ, పట్టణ ఎస్ఐ విశ్వనాథ్ అమ్మవారిని దర్శించుకున్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. అనంతరం తిరునాళ్లలో ఏర్పాట్లు, బందోబస్తు చర్యలను పర్యవేక్షించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. తిరునాళ్లకు వచ్చే భక్తులకు శివాలయం మాజీ చైర్మన్ కుందుర్తి సత్యనారాయణ మూర్తి, ఎంకే ఇంగ్లిష్ మీడియం పాఠశాల డైరెక్టర్ ఎంకే బాబు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు కొలసాని రవికుమార్, పినమాల నాగకుమార్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్, మజ్జిగ పంపిణీ చేశారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



పాతగన్నవరంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ దంపతులు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో అమ్మవారి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తొలుత అఖండ దీపారాధనను జాస్తి ఫణిశేఖర్, శ్రీవాణి దంపతులు వెలిగించి కల్యాణ వేడుకను ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి, స్వామివారికి కంకణధారణ, మానుపూజ, గ్రామ పొంగళ్లు సమర్పించారు. శ్రీగీతా సమాజం భక్త బృందంచే సౌందర్యలహరి పారాయణం చేశారు. సాయంత్రం శ్రీలక్ష్మీతిరుపతమ్మ సమేత గోపయ్యస్వామి ఉత్సవమూర్తులను కల్యాణ వేదికపైకి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, జ్ఞానేశ్వరి దంపతులతో పాటు పలువురు కన్యాదాతలుగా వ్యవహరించగా వేద పండితులు శాస్త్రోక్తంగా అమ్మవారి కల్యాణాన్ని జరిపారు. ఆలయ కమిటీ తరుపున జాస్తి నాగేశ్వరరావు, అనంతలక్ష్మి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు, ఎంపీడీఓ స్వర్ణలత, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, పలువురు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లు నూరుశాతం పూర్తికావాలి



సమీక్ష నిర్వహిస్తున్న రీజనల్ డైరెక్టర్ నాగ నరసింహారావు

ఉయ్యూరు: మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో పన్నుల వసూళ్లు నూరు శాతం పూర్తి చేయాలని మున్సిపల్ శాఖ రీజనల్ డైరెక్టర్(రాజమండ్రి) సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. ఉయ్యూరు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో కార్పొరేషన్, మున్సిపాలిటీల వారీగా పన్నుల వసూళ్లు, ఈ ఆఫీసు, బయోమెట్రిక్ అమలు, నాన్ ట్యాక్స్ రివైజ్డ్, రోడ్ల మరమ్మతులు, పాలనాపరమైన అంశాలపై సమీక్ష చేశారు. ప్రభుత్వ భవనాలు, కోర్టు కేసులు కారణంగా కొన్ని చోట్ల పన్నుల వసూళ్లలో జాప్యం జరుగుతుందన్నారు. నూరు శాతం పన్నుల వసూళ్లే లక్ష్యంగా పని చేయాలని చెప్పారు. ఆదాయాన్ని పెంచుకుని అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నాన్ ట్యాక్స్ రివైజ్డ్‌పై దృష్టి సారించాలన్నారు. ప్రతి మూడేళ్లకు ఓ సారి నాన్ ట్యాక్స్ రివైజ్డ్ చేయాలన్నారు.

ప్రథమ స్థానంలో తాడిగడప..

మున్సిపాలిటీల్లో రహదారుల అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టాలని చెప్పారు. ఈ-ఆఫీసు, బయోమెట్రిక్ విధానం అమలుపై శ్రద్ధ వహించాలన్నారు. కృష్ణాజిల్లాలో పన్నుల వసూళ్లలో తాడిగడప ప్రథమ స్థానంలో ఉందన్నారు. తరువాత స్థానాల్లో ఉయ్యూరు, గుడివాడ ఉన్నాయన్నారు. రాజమండ్రి డైరెక్టరేట్ పరిధిలో 31 మున్సిపాలిటీల్లో 21 మున్సిపాలిటీలను స్వయంగా సందర్శించానని చెప్పారు. కార్పొరేషన్, మున్సిపల్ కార్యాలయాల తనిఖీలతో పురోగతి కనిపిస్తోందన్నారు. స్వచ్ఛాంధ్ర మిషన్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో మచిలీపట్నం, ఉయ్యూరు, గుడివాడ, తాడిగడప, పెడన కమిషనర్లు బాపిరాజు, పాయసం వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, భవానీప్రసాద్, రాజగోపాల్, మున్సిపల్ విభాగ అధికారులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఎలిజబెత్‌రాణి, మహిళా నేతలు

గన్నవరం: రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో గన్నవరం నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తున్న పోలీస్ అధికారులు, టీడీపీ నేతలపై రాష్ట్ర గవర్నర్ చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి కోరారు. ఈ మేరకు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. టీడీపీ ఆఫీస్‌పై దాడి కేసును కూటమి ప్రభుత్వం కేవలం కక్ష సాధింపు చర్యలకు ఉపయోగించుకుంటుందన్నారు. ఘటనా స్థలంలో లేని దళితుడైన సత్యవర్ధన్‌ను పోలీసులు భయపెట్టి సాక్షిగా సంతకం పెట్టించుకుని, ఆ తర్వాత అతనే ఫిర్యాదుదారుడిగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్లు నమోదు చేయడం దారుణమన్నారు. ఈ విషయాన్ని సత్యవర్ధన్ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టుకు హాజరై అఫిడవిట్ రూపంలో సమర్పించడం ద్వారా టీడీపీ కుట్రలు బట్టబయలయ్యాయని చెప్పారు. వైఎస్సార్ సీపీ నేతలను వేధించడమే లక్ష్యంగా టీడీపీ, పోలీస్ అధికారులు వ్యవహరిస్తున్న తీరును ప్రజలందరూ గమనించాలని కోరారు. వీరిపై చర్యలు కోరుతూ గవర్నర్‌కు లేఖ రాస్తామన్నారు. పార్టీ నేతలు సూరెడ్డి మణిమ్మ, పద్మ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సైంటిఫిక్ పేపర్ ప్రజెంటేషన్‌లో సత్తా



విజేతలతో ప్రిన్సిపాల్ రామోజీరావు తదితరులు

గన్నవరంరూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా, నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో సత్తా చాటి పతకాలు సాధించారు. ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకూ చెన్నైలో జరిగిన 75వ ఇండియన్ డెంటల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని సైంటిఫిక్ పేపర్ ప్రజెంటేషన్ కేటగిరిలో విజేతలుగా రాణించారు. పోస్ట్ గ్రాడ్యుయేట్స్ విభాగంలో ఎండీఎస్ కన్సర్వేటీవ్ మూడో సంవత్సరం విద్యార్థిని డాక్టర్ వై.ఇందుమతి ఎండోడాంటిక్స్ కేటగిరిలో పాల్గొని ప్రథమస్థానం సాధించారు. అండర్ గ్రాడ్యుయేట్ విభాగంలో సైంటిఫిక్ పేపర్ ప్రజెంటేషన్, ఇ-పోస్టర్ కేటగిరిలో ఆరుగురు విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. ఎస్.జాన్ కెనడి, పల్లి ప్రీతి, మోనిశ్, శ్రీలక్ష్మి, సునీత, దేదీప్య ప్రథమంగా రాణించగా, ద్వితీయ స్థానంలో మరో ఆరుగురు విద్యార్థులు రేవతి, సంజన, అలేఖ్య, ధరణి, చైతన్య, ఇందీపలు నిలిచారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు, కళాశాల కన్వీనర్ పాలడుగు సాయి మాట్లాడుతూ ఇండియన్ డెంటల్ కాన్ఫరెన్స్‌లో పతకాలు సాధించిన విద్యార్థులు కళాశాలకు గర్వకారణమన్నారు. ఏఓ వై.మధుసూదనరావు, హెచ్ఓడీలు, ప్రొఫెసర్ పల్లవి, డాక్టర్ అజయ్ బెనర్జీ, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోరంకి రామాలయానికి భారీగా విరాళాలు



పెనమలూరు: పోరంకి గ్రామంలో పునఃనిర్మాణం చేసిన శ్రీ సీతాలక్ష్మణ ఆంజనేయ సమేత శ్రీ కోదండ రామాలయానికి దాతలు మంగళవారం విరాళాలు అందజేశారు. ఈ నెల 13వ తేదీన ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన తోటకూర వీరయ్యచౌదరి, సీతారావమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు తోటకూర వెంకట సుబ్బారావు, హరకిషోర్‌లు రూ.1,01,116, బొబ్బా గోపాలకృష్ణ రూ.1,00,116, పొట్లూరి నాగశ్రీనివాసరావు పెంచల్‌రెడ్డి రూ.2,00,116 లక్షలు, తోటకూర కోటేశ్వరరావు జ్ఞాపకార్థం ఆయన భార్య ప్రజారాజ్యం రూ.1,00,116, గుమ్మడెల్లి గణేష్‌కుమార్, పద్మ రూ.1,00,166లను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

నున్న(విజయవాడరూరల్): సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరమని డాక్టర్ విజయ అన్నారు. నున్న - 2 సచివాలయం ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం సంచార చికిత్స కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జ్వరాలకు సంబంధించి సుమారు 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగర్ వ్యాధిగ్రస్తులకు రోజూ వ్యాయామం అవసరమని డాక్టర్ విజయ సూచించారు. ప్రతి నెలా రెండు దఫాలు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేస్తున్నామన్నారు.

కోయ బాలచందుకు డాక్టరేట్



పెనమలూరు: పెనమలూరు గ్రామానికి చెందిన కోయ బాలచందుకు కాంచీపురానికి చెందిన ప్రతిష్టాత్మకమైన శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ మేరకు డాక్టరేట్‌ను ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఇంజినీరింగ్ (ఏఐసీటీఈ)చైర్మన్ ప్రొఫెసర్ టీజీ.సీతారామన్ ఈ నెల 8వ తేదీన బాలచందుకు డాక్టరేట్ అందజేశారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న బాలచందు స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో చేసిన పరిశోధనలకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

వైభవంగా అంకమ్మతల్లి గ్రామోత్సవం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం బిళ్లనపల్లిలో అంకమ్మ తల్లి ఉత్సవాలు రెండో రోజున ఘనంగా జరిగాయి. అమ్మవారి గ్రామోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై అంకమ్మ తల్లి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి మేళ తాళాల నడుమ ఊరేగించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు కొండపావులూరి వెంకట బాబురావు, మోహన్ కుమార్, హేమంత్ కుమార్, తులసీరాం ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దాతల తోడ్పాటుతో శ్మశానవాటిక అభివృద్ధి



ఉంగుటూరు: స్వగ్రామం మీద అభిమానంతో రూ.7.5 లక్షలతో కర్మల భవనం నిర్మించి సూరెడ్డి వెంకట్రామయ్య కుటుంబీకులు దాతృత్వాన్ని చాటుకున్నారు. ఉంగుటూరు మండలం మానికొండ గ్రామస్తులైన సూరెడ్డి రాజేంద్రప్రసాద్, విష్ణు వ్యాపార నిమిత్తం విజయవాడలో స్థిరపడ్డారు. సూరెడ్డి వెంకట్రామయ్య జ్ఞాపకార్థం గ్రామంలోని హిందూ శ్మశానవాటిక అభివృద్ధి, కర్మల భవనం నిర్మాణం చేయడాన్ని సూరెడ్డి రామ్మోహన్‌రావు, ఆరికట్ల రవి అభినందించారు. శ్మశాన వాటికలో స్నానాదులకు వసతులు కల్పించి, కర్మలు చేయటానికి భవనాన్ని నిర్మించి అభివృద్ధి చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి స్వల్ప గాయాలు

ఉంగుటూరు: చెన్నై - కోల్‌కతా జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. సేకరించిన వివరాల ప్రకారం ఏలూరుకు చెందిన బి.వెంకట సాంబశివరావు బైక్‌పై విజయవాడ వెళ్తున్నాడు. ఆత్కూరు చేరుకున్న సాంబశివరావుకు కళ్లు తిరిగినట్లు అనిపించి బైక్ అదుపు తప్పి అక్కడ ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. ఈ ఘటనలో స్వల్ప గాయాలు కావడంతో వైద్యం నిమిత్తం స్థానికులు చిన్న అవుటపల్లి పిన్నమనేని ఆస్పత్రికి తరలించారు.